# భారత కమ్యూనిస్టు పార్టీ (మావోయిస్టు)

## దండకారణ్య స్పెషల్ జోనల్ కమిటీ

**పత్రికా ప్రకటన**

ఏప్రిల్ 5, 2013

### ఝార్ఖండ్‌లోని ఛత్రా జిల్లాలో టీపీసీ-పోలీసు-సీఆర్‌పీఎఫ్ మూకలు పది మంది కామ్రేడ్స్‌ను హత్య చేయడానికి నిరసనగా....

### మహారాష్ట్రలోని గడ్చిరోలి జిల్లాలో సీ-60 కమాండోలు విచ్చలవిడి కాల్పులు జరిపి ఐదుగురు కామ్రేడ్స్ ప్రాణాలు బలిగొనడానికి వ్యతిరేకంగా...

# ఏప్రిల్ 8, 2013న 'దండకారణ్య బంద్'ను జయప్రదం చేయండి!

### విప్లవ ప్రతిఘాతుక ముఠాలను పెంచి పోషిస్తూ, స్పాన్సర్ చేస్తూ ప్రజలపై, విప్లవకారులపై దాడులు చేయిస్తున్న దోపిడీ ప్రభుత్వాల ఫాసిస్టు విధానాలను ఓడించండి!

మార్చ్ 27-28 మధ్య రాత్రి ఝార్ఖండ్‌లోని ఛత్రా జిల్లా, కుండ పోలీసుస్టేషన్ పరిధిలోని లకర్‌బంధా అడవుల్లో ప్రభుత్వ-ప్రాయోజిత తృతీయ ప్రస్తుతీ కమిటీ (టీపీసీ), పోలీసులు, సీఆర్‌పీఎఫ్-కోబ్రా బలగాలు కుమ్మక్కై ఒక భారీ హత్యాకాండకు పాల్పడ్డాయి. సీఆర్‌పీ బలగాల కమాండర్‌గా రిటైరయ్యి ప్రస్తుతం ఝార్ఖండ్‌లో గవర్నర్‌కు సలహాదారుగా వ్యవహరిస్తున్న రక్తపిపాసి కే. విజయ్‌కుమార్, సోనియా-మన్మోహన్-షిందే-చిదంబరం-జయరాం రమేష్‌ల ఫాసిస్టు పాలక ముఠా కనుసన్నల్లో ఈ దారుణ ఊచకోతకు కుట్ర పన్నాడు. సీపీఐ (మావోయిస్టు)ను, దాని నాయకత్వంలో కొనసాగుతున్న విప్లవోద్యమాన్ని నిర్మూలించే భారీ కుట్రలో భాగమే ఇది. ఒక కోవర్ట్ ఆపరేషన్ ద్వారా మా పీఎల్‌జీఏ సైనికులను టీపీసీ మూకలు, పోలీసులు, కోబ్రాలు వందల సంఖ్యలో చుట్టుముట్టి, ఆ తర్వాత ఈ క్రూర దాడికి పూనుకున్నారు. రాత్రి సమయంలో జరిగిన ఈ దాడిలో ముగ్గురు కామ్రేడ్స్ పోరాడుతూ ప్రాణాలర్పించారు. మిగతా వాళ్లను సజీవంగా పట్టుకున్నారు. వాళ్ల ఆయుధాలను దోచుకున్నారు. తెల్లారిన తర్వాత టీపీసీ, పోలీసు, సీఆర్‌పీఎఫ్ హంతకులు మరో ఏడుగురు కామ్రేడ్స్‌ను ఏరి ఏరి దారుణంగా కాల్చి చంపేశారు. చంపడానికి ముందు వాళ్లను చెప్పనలవి కాని చిత్రహింసలకు గురి చేశారు. అంతే కాకుండా కనీసం మరో 25 మంది కామ్రేడ్స్‌ను బంధించి పట్టుకెళ్లారు.

చనిపోయిన వాళ్లలో కామ్రేడ్ లలేష్ యాదవ్ ఎలియాస్ ప్రశాంత్ (బిహార్-ఝార్ఖండ్-ఉత్తర ఛత్తీస్‌గఢ్ స్పెషల్ ఏరియా కమిటీ సభ్యుడు, మధ్య జోనల్ ఇన్‌ఛార్జ్ - బిహార్ రీజియన్), కామ్రేడ్ ధర్మేంద్ర యాదవ్ (సబ్-జోనల్ కమిటీ సభ్యుడు), కామ్రేడ్ ప్రఫుల్ (సబ్-జోనల్ కమిటీ సభ్యుడు), కామ్రేడ్ జయకుమార్ యాదవ్ (ప్లాటూన్ కమాండర్), కామ్రేడ్ భోలా ఎలియాస్ అజయ్ యాదవ్, కామ్రేడ్ అల్బర్ట్ ఎలియాస్ బిజయ్, కామ్రేడ్ ప్రమోద్ తదితరులు వున్నారు. ఈ వీరయోధులకు, పీడిత ప్రజల ఉత్తమ పుత్రులకు దండకారణ్య స్పెషన్ జోనల్ కమిటీ వినమ్రంగా శ్రద్ధాంజలి అర్పిస్తుంది. అసంపూర్తిగా మిగిలిన అమరుల కర్తవ్య సాధనకు పునరంకితమతుంది. అమరవీరుల కుటుంబ సభ్యులకు, మిత్రులకు, సహచరులకు, బిహార్-ఝార్ఖండ్-ఉత్తర ఛత్తీస్‌గఢ్ పీడిత ప్రజానీకానికంతటికీ ప్రగాఢ సానుభూతిని తెలుపుతూ వాళ్ల దుఃఖాన్ని పంచుకుంటున్నది.

దోపిడీ పాలకవర్గాలు, వాళ్ల బంటులైన పోలీసు అధికారులు ఈ హత్యాకాండను టీపీసీ, సీపీఐ (మావోయిస్టు)ల మధ్య అంతర్గత సంఘర్షణ ఫలితమని చెబుతూ తమ చేతులకంటిన రక్తపు మరకల్ని దాచిపెట్టాలని ప్రయత్నిస్తున్నాయి. కార్పొరేట్ వర్గాల చేతుల్లో నడిచే, పోషించబడే మీడియా ఈ హత్యాకాండ మాటున రకరకాల పచ్చి అబద్ధాలతో విప్లవోద్యమానికి వ్యతిరేకంగా దుష్ప్రచార క్యాంపెయిన్‌ను ప్రారంభించింది. టీపీసీ అనేది లెవీ డబ్బుల పంపకాల్లో తలెత్తిన వివాదాల ఫలితంగా సీపీఐ (మావోయిస్టు) నుండి వేరుపడి ఏర్పడిన సంఘమని ఒక మీడియా సంస్థ 'కనిపెట్టగా', అది సైద్ధాంతిక విభేదాలతో చీలిపోయిన సంస్థ అని మరొకటి పేర్కొన్నది. మరి కొన్ని పత్రికలు దీనికి మూలం కులపోరు అని, అంటే ఆదివాసులకు, మిగతా కులాలకు మధ్య తగాదా అని రాశాయి. ఈ సంఘటనపై నిష్పక్ష న్యాయవిచారణ జరపాలని ప్రజాస్వామిక సంఘాలు డిమాండ్ చేయగా ఒక పేరుగాంచిన పత్రిక 'చట్టవ్యతిరేక' సంఘం చట్టం గురించి మాట్లాడుతున్నదని ఎగతాళి చేసింది. ప్రజాస్వామ్యానికి నాలుగో స్తంభాన్నని చెప్పుకునే మీడియా మౌలిక ప్రజాస్వామ్య విలువలను కూడ భరించలేని స్థితిలో వుందని దీని ద్వారా స్పష్టమవుతున్నది. పాలక వర్గాల సైకలాజికల్ వార్‌ఫేర్‌లో భాగమైన ఈ తప్పుడు ప్రచారాన్నంతా తిప్పికొట్టాలని దండకారణ్య స్పెషల్ జోనల్ కమిటీ దేశ ప్రజలందరికీ పిలుపునిస్తున్నది.

బిహార్-ఝార్ఖండ్‌లో దశాబ్దాలుగా ఎగిసిపడుతున్న విప్లవోద్యమ జ్వాలల్ని ఆర్పేయ్యడానికి దోపిడీ ప్రభుత్వాలు రకరకాల సాయుధ ముఠాలను ఏర్పాటు చేసి వాటిలోకి గుండాల్ని, లంపెన్‌లను, వేర్వేరు కారణాలతో ఉద్యమం నుండి దిగజారిన వాళ్లను చేర్పిస్తున్నాయి. టీపీసీ, పీఎల్‌ఎఫ్ఐ, నాగరిక్ సురక్షా సమితి వంటి సాయుధ ముఠాలను పోలీసులూ, అర్ధసైనిక బలగాలే సృష్టిస్తున్నాయి, నడిపిస్తున్నాయి. ఈ ఫాసిస్టు మూకలు నిత్యం దోపిడీలకు, దొంగతనాలకు, వసూళ్లకు, అత్యాచారాలకు, హత్యలకు పాల్పడుతున్నాయి. ఆంధ్రప్రదేశ్‌లో వివిధ నల్లదండు ముఠాలు, దండకారణ్యంలో సల్వాజుడుం, బెంగాల్‌లో హర్మద్ బాహిని, భైరవ్ బాహిని, ఒడిషాలో శాంతి సంఘా మొదలైనవి కూడ ఈ తరహావే. వాటి ఏర్పాటు కూడ ప్రభుత్వాల ఫాసిస్టు విధానాల్లో భాగమే.

మరోవైపు, మీడియా వార్తల ప్రకారం, ఏప్రిల్ 4న ఛత్తీస్‌గఢ్-మహారాష్ట్ర సరిహద్దులో మహారాష్ట్రలోని గడ్చిరోలి జిల్లా, భామ్రాగఢ్ ప్రాంతంలో సీ-60 కమాండోలతో జరిగిన ఎదురుకాల్పుల్లో ఇద్దరు మహిళలు సహా ఐదుగురు మావోయిస్టులు మృతి చెందారు. మృతుల సంఖ్య ఇంకా పెరగవచ్చని కూడ పోలీసులు పేర్కొన్నారు. రహస్యంగా సమావేశం జరుపుతున్న వంద మందికి పైగా మావోయిస్టులతో రెండు గంటల పాటు సాగిన ఎదురుకాల్పుల్లో ఈ మరణాలు చోటు చేసుకున్నాయని, తమ వైపు ఎవరికీ చిన్న గాయమైనా కాలేదని కూడా ప్రకటించారు! వంద మంది మావోయిస్టులు సమావేశమయ్యారనే పోలీసుల కథనం కేవలం కట్టుకథ మాత్రమే. నిజానికి మా స్థానిక దళానికి చెందిన కామ్రేడ్స్ తమ రోజువారీ కార్యకలాపాల్లో భాగంగా ప్రజలతో సమావేశమై సమస్యలను చర్చిస్తూ వుండినారు. తమ ఇన్‌ఫార్మర్స్ ద్వారా సమాచారం పొందిన పోలీసులు వందలాది సంఖ్యతో మూడు వైపుల నుండి చుట్టుముట్టి విచ్చలవిడిగా కాల్పులు ప్రారంభించారు. అకస్మాత్తుగా జరిగిన ఈ దాడితో ప్రజలందరూ చెల్లాచెదురై భయంతో అటు ఇటు పారిపోతుండగా, నిరాయుధులపై కూడ లైసెన్స్‌డ్ హంతకులైన కమాండోలు గుళ్లవర్షం కురిపించారు. ఈ ఏకపక్ష దాడిలో మా పీఎల్‌జీఏ కామ్రేడ్స్‌తో పాటు కొందరు గ్రామస్తులు కూడ మరణించారు. చాలా మంది గాయపడ్డారు. కొద్ది రోజుల క్రితం గడ్చిరోలి పోలీసులు 'ఆపరేషన్ నవజీవన్' పేరుతో ఒక దివాళాకోరు క్యాంపెయిన్‌ను ప్రారంభించారన్నది గమనార్హం. ఇందులో భాగంగా, మా పార్టీలో పని చేస్తున్న కార్యకర్తలను సరెండర్ చేయించడం కోసం వాళ్ల కుటుంబాలపై రకరకాలుగా వత్తిడి చేస్తున్నారు. ఈ తాజా హత్యాకాండ కూడ ఈ ఆపరేషన్‌లో అంతర్భాగమే. పోలీసులు దీన్ని ఈ సంవత్సరం తమకు లభించిన రెండో పెద్ద విజయంగా పేర్కొంటూ సంబరపడుతున్నారు. డీఐజీ రవీంద్ర కదమ్, ఎస్పీ సూవెజ్ హక్, అహిరి ఎస్‌డీపీఓ భరత్ ఠాకుర్‌లు ఈ హత్యాకాండకు ప్రధాన సూత్రధారులు. హత్యలతో, బీభత్సంతో విప్లవోద్యమాన్ని రూపుమాపగలమని వీళ్లు కంటున్న కలలు చివరకు పగటి కలలుగానే రుజువు కాకతప్పదు.

2009 మధ్య నుండి భారత పాలకవర్గాలు అమెరికా సామ్రాజ్యవాదుల ప్రోద్బలంతో ఆపరేషన్ గ్రీన్‌హంట్ పేరుతో ఒక భారీ బహుముఖ దాడిని కొనసాగిస్తున్న విషయం తెలిసిందే. ఇందులో భాగంగా పదుల వేల పోలీసు బలగాలతో పాటు దాదాపు ఒక లక్ష అర్ధసైనిక బలగాలను దేశంలో విప్లవోద్యమం బలంగా కొనసాగుతున్న ప్రాంతాలంతటా మోహరించారు. ఈ దాడి నిజానికి 'ప్రజలపై యుద్ధం'. దీని లక్ష్యం ప్రజాస్వామిక, విప్లవకర ఉద్యమాలన్నిటినీ అంతమొందించడం, ఈ ప్రాంతాల్లోని సహజ వనరులన్నిటినీ దేశీయ, విదేశీ కార్పొరేట్ కంపెనీలకు విచ్చలవిడిగా దోచుకునే వీలు కల్పించడం. తమ ఈ లక్ష్యాన్ని సాధించడం కోసం సామ్రాజ్యవాదుల ఎల్ఐసీ (తక్కువ తీవ్రత గల సంఘర్షణ) వ్యూహాన్ని అరువు తెచ్చుకున్నారు. ఈ దుష్ట విధానంలో భాగంగానే టీపీసీ వంటి విప్లవ ప్రతిఘాతుక ముఠాలను పెంచిపోషిస్తూ వాటిని మాపై ఎగదోస్తున్నారు. పోలీసు, అర్ధసైనిక, సాయుధ కమాండో బలగాలతో నరమేధాలకు పాల్పడుతున్నారు. ప్రజలు ఈ కుట్రలన్నిటినీ తప్పక భగ్నం చేస్తారనీ, ఈ ముఠాలు, వాటి యజమానులు తాము పాల్పడుతున్న అకృత్యాలకు తగిన మూల్యం చెల్లించక తప్పదనీ మేం హెచ్చరిస్తున్నాం.

ఝార్ఖండ్‌లో టీపీసీ-పోలీసులు-కోబ్రాలు పాల్పడిన ఫాసిస్టు హత్యాకాండను నిర్ద్వంద్వంగా ఖండించాలనీ, ఈ సంఘటన దరిమిలా కార్పొరేట్ మీడియా చేస్తున్న దుష్ప్రచారాన్ని ఖండించాలనీ, టీపీసీ-సీఆర్‌పీఎఫ్ నిర్బంధించిన మా కామ్రేడ్లందరినీ సురక్షితంగా విడుదల చేయాలని డిమాండ్ చేయాలనీ సీపీఐ (మావోయిస్టు) దండకారణ్య స్పెషల్ జోనల్ కమిటీ దేశంలోని కార్మిక-కర్షకులకు, విద్యార్థి-మేధావులకు, రచయితలకు, పత్రికా విలేకరులకు, సంపాదకులకు, అధ్యాపకులకు, న్యాయవాదులకు - సమస్త ప్రజా పక్షపాతులకు, దేశభక్తులకు విజ్ఞప్తి చేస్తున్నది. గడ్చిరోలి జిల్లాలోని భామ్రాగఢ్ ప్రాంతంలో జరిగిన క్రూర హత్యాకాండను ఖండించాలని కోరుతున్నాం. జల్-జంగల్-జమీన్‌పై ప్రజల అధికారం కోసం, దేశంలోని అమూల్య సహజ సంపదల దోపిడీని అడ్డుకోవడం కోసం, నూతన ప్రజాస్వామిక వ్యవస్థ నిర్మాణం కోసం బిహార్-ఝార్ఖండ్, దండకారణ్యం సహా దేశంలోని వివిధ ప్రాంతాల్లో కొనసాగుతున్న విప్లవోద్యమం సరసన దృఢంగా నిలబడాలని కూడ మేం ఈ సందర్భంగా వినమ్రంగా కోరుతున్నాం.

ఈ ఫాసిస్టు హత్యాకాండలకు నిరసనగా ఏప్రిల్ 8న 24 గంటల పాటు 'దండకారణ్య బంద్' జరుగుతుంది. ఈ సందర్భంగా వివిధ రూపాల్లో నిరసన, ప్రతిఘటనా చర్యలు, ప్రజా సమీకరణ జరుగుతాయి. (విద్యార్థుల పరీక్షలను, వైద్యం వంటి అత్యవసర సేవలను ఈ బంద్ నుండి మినహాయిస్తున్నాం.) దీనిని విజయవంతం చేయాల్సిందిగా మేం దండకారణ్య ప్రజానీకానికి విజ్ఞప్తి చేస్తున్నాం.

Gudsa Usendi

**(గుడ్సా ఉసెండి)**

**అధికార ప్రతినిధి,**

**దండకారణ్య స్పెషల్ జోనల్ కమిటీ,**

**భారత కమ్యూనిస్టు పార్టీ (మావోయిస్టు)**